77 ఇళ్లు.. 460 దరఖాస్తులు!

- బాల్కొండలో 177 డబుల్ బెడ్‌రూం ఇళ్లలో 100 ఇళ్ల పంపిణీ
- మిగిలిన ఇళ్లకు దరఖాస్తులు స్వీకరించినా.. పంపిణీ చేయని అధికారులు


బాల్కొండలో పంపిణీకి నోచుకోని డబుల్ బెడ్‌రూం ఇళ్లు

బాల్కొండ : మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు పూర్తిస్థాయిలో పంపిణీకి నోచుకోవడం లేదు. మిగిలిన 77 ఇళ్లను దసరాకు పంపిణీ చేస్తామని ప్రభుత్వ పెద్దలు ప్రకటించడంతో అధికారులు దరఖాస్తులు చేసుకోవాలని చాటింపు చేశారు. దీంతో ఇళ్ల కోసం సుమారు 460 మంది దరఖాస్తు చేసుకున్నారు. కానీ దసరా, దీపావళి కూడా పోయినా ఎంకా ఇళ్ల పంపిణీ చేపట్టకపోవడంతో పేదలకు ఎదురుచూపులు తప్పడం లేదు.

ఇదీ పరిస్థితి..

బాల్కొండ మండల కేంద్రంలో గత ప్రభుత్వం 177 ఇళ్లను నిర్మించింది. గత అసెంబ్లీ ఎన్నికల వేళ 100 మందికి ఇళ్లను పంపిణీ చేసింది. మిగతా 77 ఇళ్లను పంపిణీ చేయకపోవడంతో ఏడాది నుంచి నిరుపయోగంగా ఉంటున్నాయి. కానీ పాలకులు వాటిని లబ్ధిదారులకు మాత్రం అందివ్వడం లేదు.

దరఖాస్తు ప్రక్రియ పూర్తయి పక్షం రోజులు గడుస్తున్నా.. ఇప్పటి వరకు ఇళ్ల పంపిణీపై అధికారులు స్పందించకపోవడంపై దరఖాస్తుదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పంపిణీ చేసిన 100 ఇళ్లను డబ్బులు ఇచ్చిన వారికే ఇచ్చారనే ఆరోపణాలు జోరుగా వచ్చాయి. అప్పటి అధికార పార్టీ చెందిన ఒక నాయకుడు తన కుటుంబ సభ్యులకే ఏడు ఇళ్లు ఇప్పించుకున్నాడంటు సొంత పార్టీ నాయకులే రాద్ధంతం చేసిన ఘటనలు జరిగాయి. ప్రస్తుతం కూడ చేతులు తడిపితేనే ఇళ్లు ఇస్తారనే ఆందోళనలో లబ్ధిదారులు ఉన్నారు. పంపిణీలో జాప్యం వెనుక గల కారణం ఇదే అంటు గుసగుసలు వినవస్తున్నాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి అర్హులైన లబ్ధిదారులకు వెంటనే ఇళ్లు పంపిణీ చేయాలని దరఖాస్తుదారులు వేడుకుంటున్నారు.

పరిశీలన చేయలేదు..

బాల్కొండలో మిగిలిన 77 డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం 460 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ప్రస్తుతం సమగ్ర కుటుంబ సర్వే, ఎమ్మెల్సీ ఎన్నికలు ఉండటంతో పరిశీలన చేపట్టడం లేదు. ఇవి పూర్తయ్యాక ఉన్నత అధికారుల ఆదేశాల ప్రకారం ప్రక్రియను ప్రారంభిస్తాం. – శ్రీధర్, తహసీల్దార్, బాల్కొండ

క్లుప్తంగా

ఊట్‌పల్లి ఊర చెరువు పరిశీలన



బోధన్‌రూరల్: మండలంలోని ఊట్‌పల్లి గ్రామ శివారులోని ఊర చెరువును ఇరిగేషన్ శాఖ డిప్యూటీ డీఈ లోక్య నాయక్ ఆదివారం పరిశీలించారు. తమ గ్రామ శివారులోని ఊర చెరువు అలుగు మరమ్మతులు చేపట్టాలని ఇటీవల గ్రామ రైతులు, నాయకులు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని కలిసి విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే సుదర్శన్ చెరువు అలుగు మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దీంతో డిప్యూటీ డీఈ లోక్య నాయక్ చెరువును, అలుగును పరిశీలన చేశారు. కాంగ్రెస్ నాయకులు టప్ప సాయిలు, సాయిరెడ్డి, నర్సయ్య, జమీల్, సూరి, రైతులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రం..



వేల్పూర్: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ సంతోష్ పరిశీలించారు. మండలంలోని 39 పోలింగ్ బూత్‌లలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఏ పోలింగ్ బూత్‌లో ఎంతమంది ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకున్నది తెలుసుకున్నారు. ఓటరుగా నమోదు కోసం అవసరమైన అర్హత పత్రాలన్ని సక్రమంగా సమర్పిస్తున్నది లేనిది చూసుకోవాలని బూత్‌లెవల్ అధికారులను ఆదేశించారు. లక్కోరలో తహసీల్దార్‌తో జీపీ కార్యదర్శి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

జనావాసాల్లోని డెయిరీ ఫామ్‌ను తొలగించాలి

బోధన్‌టౌన్(బోధన్): జనావాసాల్లో ఏర్పాటు చేసిన డెయిరీ ఫామ్ ను తొలగించాలని పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీ వాసులు కోరారు. ఈమేరకు వారు ఆదివారం ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీ వాసు లు మాట్లాడుగూ.. పట్టణంలోని ఆచన్‌పల్లిలోగల శ్రీరాం నగర్‌కాలనీలో డైరీఫాం ఏర్పాటు చేయడం వల్ల దోమల బెడదతో పాటు దుర్వాసన వస్తుందని, దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. సమస్యను అధికారులకు విన్నవించినా ఫలితంలేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా డైరీఫాంను తొలగించేలా అధికారులను ఆదేశించాలని ఎమ్మెల్యేను కోరారు.

బీఆర్ఎస్ జెండా ఆవిష్కరణ



వర్ని: మోస్రా మండలం గోవూర్ గ్రామంలో ఆదివారం బీఆర్ఎస్ నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. గతంలో ఉన్న జెండా గద్దె చెడిపోవడంతో నూతనంగా నిర్మించిన జెండా గద్దె వద్ద జెండా ఆవిష్కరణ చేశారు. పార్టీ నాయకులు శంకర్, కురుమే అబ్బయ్య, సతీష్, శేఖర్, మక్బూల్ ఖాన్, సుధాకర్‌చారి, అనిల్ గౌడ్, చరణ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్నదాతలు దళారులకు ధాన్యం అమ్ముకోవద్దు



వేల్పూర్: అన్నదాతలు తమ ధాన్యాన్ని దళారులకు అమ్ముకోవద్దని వేల్పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గడ్డం నర్సారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పచ్చలనడ్కుడలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులందరి ధాన్యం కొనుగోలు చేసేదాకా కేంద్రాలు ఉంటాయన్నారు. సొసైటి చైర్మన్ లింబారెడ్డి, డైరెక్టర్ నర్సారెడ్డి, నాయకులు టక్కరి గంగాధర్, గుడాల మోహన్, లింగేశ్వర్, మహేశ్, రాము, భోజేందర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

నిజామాబాద్‌అర్బన్: నగరంలో మహిళా డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ(భారత విద్యార్థి ఫెడరేషన్) అధ్యక్షురాలు దీపిక డిమాండ్ చేశారు. నగరంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం నగర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించకపోతే విద్యార్థుల ఉద్యమానికి ప్రభుత్వం తలవంచక తప్పదని అన్నారు. ప్రధాన కార్యదర్శి విఘ్నేశ్, నాయకులు దినేష్, చక్రి, అజాద్, వీణ, హర్షిత పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి


బోధన్‌లో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ప్రయివేట్ విద్యాసంస్థల ప్రతినిధులు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, ప్రతీ ఒక్క విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సూచించారు. పట్టణంలోని ఇందూర్ హైస్కూల్‌లో ఆదివారం ఆయన ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. అంతకుముందు విద్యార్థులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యతోనే భవిష్యత్ ఉందని, బాగా చదువుకోవాలని, తెలిపారు. అనంతరం ఆయన స్కూల్స్ యాజమాన్యాలతో మాట్లాడుతూ.. విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో పురోగతి సాధించేలా కృషి చేయాలని, విద్యార్థుల్లో నైపుణ్యతను వెలికితీసి, మంచి ఉత్తీర్ణత శాతాన్ని సాధించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్యను అందించాలన్నారు. అలాగే పట్టణంలోని నిజాం దక్కన్ షుగర్స్‌కు సంబంధించిన రూ. 220కోట్ల బ్యాంకు రుణాన్ని సీఎం రేవంత్‌రెడ్డి చెల్లించారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కోడాలి కిశోర్‌కుమార్, హరికృష్ణ తదితరులు ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

రెంజల్(బోధన్): రెంజల్ కాంగ్రెస్ గ్రామ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సగ్గ వెంకటి, ఉపాధ్యక్షులుగా సమీ, గైని సాయిలు, ప్రధాన కార్యదర్శిగా చందూర్ సాయన్న, కార్యదర్శులుగా కోత్వాల్ శ్రీనివాస్, దగుల శ్రీకాంత్, సాయాగౌడ్, కార్యవర్గ సభ్యులుగా రజాక్, లింగం, నరేందర్, అఫ్సర్, పోశెట్టి ఎన్నికయ్యారు. మాజీ జెడ్పీటీసీ నాగభూషణంరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుర్మె శ్రీనివాస్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఇందిరారెడ్డి, నాయకులు పోచయ్య, సాయబాబాగౌడ్, సాయాగౌడ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న నాయకులు

గోదావరికి పోటెత్తిన భక్తులు


కందకుర్తిలోని త్రివేణి సంగమ పుష్కరక్షేత్రం వద్ద భక్తుల సందడి

రెంజల్(బోధన్)/బాల్కొండ: రెంజల్ కందకుర్తి త్రివేణి సంగమ పుష్కరక్షేత్రం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. కార్తీకమాసం కావడంతో నదీ స్నానాలను ఆచరించడానికి పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. నదిలో పుణ్యస్నానాలు ఆచరించి పిండి వంటలు, నైవేద్యాలు చేసుకుని తెప్పలు వదిలారు. ఒడ్డున గల పుష్కరరాజ్ శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొందరు సత్యనారాయణ వ్రతాలు చేశారు. అలాగే బాల్కొండ మండలంలోని పోచంపాడ్ వద్దగల గోదావరిలో స్నానాలు ఆచరించడానికి భక్తులు పోటెత్తారు. ఈసందర్భంగా నదిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, కార్తీక దీపాలు వెలిగించి, మొక్కులు తీర్చుకున్నారు.


పోచంపాడ్ గోదావరిలో స్నానం చేస్తున్న భక్తులు


కందకుర్తిలోని శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సర్వేలో సిబ్బంది నిర్లక్ష్యం వహించొద్దు



రెంజల్‌లో సర్వేను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి.. ఆర్మూర్‌లో.. మున్సిపల్ కమిషనర్ రాజు


సర్వే చేపడుతున్న ఎన్యుమరేటర్లు

రెంజల్(బోధన్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి సర్వేలో ఉద్యోగులు, సిబ్బంది నిర్లక్ష్యం చేయవద్దని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సూచించారు. త్వరలో రాష్ట్రంలో నిర్వహించే స్థానిక సంస్థల ఎన్నికల్లో కుల గణన ప్రకారం రిజర్వేషన్లతో పాటు ఆర్థిక పరిస్థితుల ఆధారంగా విద్య, ఉద్యోగ అవకాశాలకు సర్వే ఆధారపడుతుందని పేర్కొన్నారు. రెంజల్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సర్వేను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సర్వే వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని సిబ్బందికి సూచించారు. మండల స్థాయి అధికారులు సర్వే పూర్తయ్యే వరకు పర్యవేక్షణ చేయాలన్నారు. ఆలస్యమైనా ప్రతీ కుటుంబం వివరాలను ఎన్యుమరేటర్లు సేకరించాలని ఆదేశించారు. ప్రజలు అధికారులకు సహకరించి అడిగిన వివరాలను అందించాలని సూచించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మొబిన్‌ఖాన్, నాగభూషణంరెడ్డి, సాయరెడ్డి, ధనుంజయ్, మోహన్, కుర్మె శ్రీనివాస్, సాయిబాబగౌడ్, జావీద్, పోచయ్య, రాజు, వెంకటి, వేను, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ పట్టణంలో..

ఆర్మూర్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వ చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వే ఆదివారం రెండోరోజు కొనసాగింది. ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన బ్లాక్‌లో ఇంటింటికీ తిరగుతూ కుటుంబ సభ్యుల వివరాలను సేకరించారు. అలాగే మున్సిపల్ కమిషనర్ రాజు పట్టణంలోని 4వ వార్డు, 6వ వార్డులో తిరుగుతూ సర్వేను పరిశీలించారు. రెండో రోజు 36 వార్డులలో 150మంది ఎన్యుమరేటర్లు 1100 కుటుంబాలను సర్వే నిర్వహించారు.

ప్రారంభమైన భీమన్న ఉత్సవాలు



పెర్కిట్(ఆర్మూర్): పెర్కిట్‌లో ఆదివారం ఆదివాసి నాయక్‌పోడ్ సంఘం ఆధ్వర్యంలో భీమన్న ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. మొదటి రోజు గంగాస్నానం, భీమన్న దేవుని గదలతో ఊరేగింపు నిర్వహించారు. సంఘం నాయకులు మూడ అశోక్, మూడ భాస్కర్, మూడ గంగాధర్, పెద్ద ముత్తెన్న, చిన్న గంగారాం పాల్గొన్నారు.

రాజారెడ్డి సేవలు స్ఫూర్తి దాయకం

పెర్కిట్(ఆర్మూర్): అంకాపూర్ మాజీ సర్పంచ్ దివంగత గడ్డం రాజారెడ్డి సేవలు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి కొనియాడారు. అంకాపూర్‌లో ఆదివారం నిర్వహించిన రాజారెడ్డి దశదిన కర్మ కార్యక్రమంలో ఆయన పాల్గొని, నివాళులు అర్పించారు. అనంతరం గ్రామంలో రాజారెడ్డి విగ్రహ ఏర్పాటుకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు.



ఘనంగా బ్రహ్మర్షి పత్రిజీ జన్మదినం



వేల్పూర్: మండలంలోని పడగల్ గ్రామంలో ఆదివారం ధ్యాన గురువు బ్రహ్మర్షి పత్రిజీ జన్మదిన వేడుకలను ధ్యానులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి, పంచిపెట్టారు. అమరవాజి శ్రీనివాస్, సాయి కృష్ణారెడ్డి, బోడ్డు దయానంద్,శేఖర్‌రెడ్డి, సునీత,పద్మ, శ్రీనివాస్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తీక మాస పూజలు



రుద్రూర్: మండల కేంద్రంలోని లక్ష్మీ గణపతి ఆలయం, పాండురంగ విఠలేశ్వర స్వామి ఆలయం, వీరభద్ర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలులు నిర్వహించారు. కార్తీక మాసం పురస్కారించుకుని ప్రతిరోజు సాయంత్ర ఆకాశ దీపం వెలిగిస్తున్నారు. శ్రీ విఠలేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 12న మంగళవారం కార్తీక ఏకాదశి పురస్కారించుకుని భక్తులు స్వామిని కాసు, కిస్మిస్, బాదాం, అంజీరాలతో అలంకరిస్తున్నారని ఆలయ అర్చకులు కులకర్ణి రామ శర్మ వివరించారు. 13న అన్నదానం, 15న రుక్మిణి, పాండురంగ కల్యాణం, దీపోత్సవం ఉంటుందని, 16న కాకడ హారతి కార్యక్రమం ముగింపు, అన్నదానం ఉంటుందని వివరించారు.

హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయకు ఘన స్వాగతం



డిచ్‌పల్లి: మండల కేంద్రంలో ఆదివారం హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి, జాతీయ కార్యవర్గ సభ్యుడు గద్దె భూమన్న ఘన స్వాగతం పలికారు. గవర్నర్ కందకుర్తి త్రివేణి సంగమం వద్ద గోదావరి హారతి కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తుండగా.. మార్గమధ్యలో డిచ్‌పల్లిలోని గద్దె భూమన్న నివాసంలో అల్పాహారం చేశారు. అనంతరం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, దినేష్ పటేల్ కులాచారి, గద్దె భూమన్న ఆయనను సన్మానించారు. ఈసందర్భంగా బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ.. తాను గవర్నర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత కందకుర్తిలోని పవిత్రమైన త్రివేణి సంగమం గంగాదేవికి హారతి సమర్పించడానికి రావడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. అంతకుముందు దత్తాత్రేయకు బెటాలియన్ సిబ్బంది గౌరవ వందనం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి లోక భూపతిరెడ్డి, నాయకులు వెంకటరమణ, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పానుగంటి సతీష్, రవీందర్ గౌడ్, చౌకి లక్ష్మణ్, మాజీ సర్పంచి సతీష్, కుమ్మరి విఠల్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

సంఘం అభివృద్ధికి కృషి చేయాలి



ఆర్మూర్‌టౌన్: చాత్తాద శ్రీవైష్ణవ సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆర్మూర్ చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం అధ్యక్షుడు డీవీఎస్ చక్రవర్తి అన్నారు. పట్టణంలోని రామ్‌నగర్ కాలనీలో సంఘం ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలించారు. సంఘ కమాన్ బోర్డును ఏర్పాటు చేశారు. సంఘ ప్రతినిధులు ఆసూరి గోవిందరాజస్వామి, లింబగిరి స్వామి, ప్రకాష్, సత్యనారాయణ, రవికాంత్, మానకొండూరు భాస్కర్, రవికాంత్, రామస్వామి, సీనయ్య, రవీందర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తాచెదారం తొలగింపు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జర్నలిస్టుకాలనీలో ఆదివారం కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్వచ్ఛకాలనీ, సమైఖ్య కాలనీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కాలనీ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కాలనీ పరిసరాల్లోని చెత్తాచెదారాన్ని తొలగించి, శుభ్రం చేశారు. పుప్పాల శివరాజ్, కొక్కెర భూమన్న, ఎర్ర భూమయ్య, రాజు, రవి, గణేష్, రాజ్‌కుమార్, సాయన్న, రవి, జీవన్, నల్ల సాయన్న, మాణిక్యం పాల్గొన్నారు.

చర్చిలో కోతకాలపు పండుగ



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఆచన్‌పల్లి సీఎస్ఐ చర్చిలో ఆదివారం కోతకాలపు పండుగను నిర్వహించారు. ముందుగా పండిన పంటలను తీసుకువచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు ప్రభాకర్, రాబర్ట్, కమిటీ ప్రతినిధులు జ్యోతిరాజ్, ఎడ్వర్డ్ ముల్లర్, పుష్పరాజ్, దాస్, అనీల్, బార్నబస్ ఉన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

కమ్మర్‌పల్లి: మండలంలోని హసకొత్తూర్‌లో ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన గడ్డం రాధిక, కనక రాజశేఖర్, నిఖితలను వీడీసీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. వీడీసీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



నిజామాబాద్ తరలిన మాలలు



వేల్పూర్: నిజామాబాద్‌లో ఆదివారం నిర్వహించిన మాలల ఆత్మీయ సమ్మేళనానికి మండలంలోని ఆయా గ్రామాల నుంచి మాల సంఘాల సభ్యులు, ఉద్యోగులు భారీగా తరలి వెల్లారు. ప్రత్యేక వాహనాల్లో సంఘ ప్రతినిధులు జిల్లాకేంద్రానికి బయలుదేరారు.

మారథాన్‌లో ప్రతిభ



వేల్పూర్: వేల్పూర్‌కు చెందిన సీఐ మోతిరాం, టీచర్ అరుణ్‌కుమార్ ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన హాఫ్ మారథాన్‌లో ప్రతిభ కనబరచి మెడల్ సాధించారు. సీఐ మోతిరాం హైదరాబాద్‌లోని సైబరాబాద్ కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తుండగా, అరుణ్‌కుమార్ ఆర్మూర్‌లో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. మారథాన్‌లో వేల్పూర్ వాసులు ప్రతిభ చూపడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నిజామాబాద్ సిటీ: నగర మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బీఎల్‌టీయూ అధ్యక్షుడు దండి వెంకట్ కోరారు. ఈమేరకు ఆదివారం ఆయన కార్మికులతో కలిసి మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కొంతమంది కార్మికులకు నెలసరి వేతనాలు బ్యాంక్‌లో వేయడం లేదని తెలిపారు. ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. నాయకులు రాజేందర్, హరీష్, మురళి, శ్రీశైలం, విశ్వనాథ్, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1 –	క (తెలుగు)-11.45 3.05 6.25 అప్పుడో ఇప్పుడో ఎప్పుడో -9.45
స్క్రీన్-3 –	లక్కీ భాస్కర్(తెలుగు)-10.00 1.15 7.30 10.45 బ్లడీ బెగ్గర్(తెలుగు)-4.30
స్క్రీన్-4 –	అమరన్ (తెలుగు) - 12.00 3.30 7.00 10.30

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	అప్పుడో ఇప్పుడో ఎప్పుడో -10.35 లక్కీ భాస్కర్(తెలుగు)-1.30 క(తెలుగు)- 4.30 10.30 జితేందర్‌రెడ్డి(తెలుగు)- 7.30
స్క్రీన్-3	అమరన్ -10.20, 4.20, 10.35 అప్పుడో ఇప్పుడో ఎప్పుడో -1.30 లక్కీ భాస్కర్(తెలుగు)-7.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)



స్క్రీన్-1	అమరన్ -12.00,6.45, 10.15 క(తెలుగు)-3.30
స్క్రీన్-2	అమరన్(తెలుగు)-10.00 అప్పుడో ఇప్పుడో ఎప్పుడో -1.30 లక్కీ భాస్కర్ -4.15,7.30,10.45
స్క్రీన్-3	సింగం అగైన్ (హిందీ)-10.50 భూల్ భులయ్యా (హిందీ)-2.00 అప్పుడో ఇప్పుడో ఎప్పుడో -5.00 జితేందర్‌రెడ్డి(తెలుగు)-7.45 క(తెలుగు)-10.45
స్క్రీన్ -4	భూల్ భులయ్యా (హిందీ)=10.00 7.05 - వంచన(తెలుగు)-1.25 బ్లడీ బెగ్గర్(తెలుగు)-4.05 సింగం అగైన్(హిందీ)-10.30
లలితామహల్	దేవర పార్ట్-1 (తెలుగు)
దేవి	లక్కీ భాస్కర్ (తెలుగు)
నటరాజ్	అమరన్ (తెలుగు)
విజయ్	క (తెలుగు)

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	81,300	వెండి(కిలో)	99,000
22 క్యారెట్స్	75,017		

– నిజామాబాద్ బిజినెస్